

శాస్త్రీయ విద్యపై చిన్న చూపు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శాస్త్రీయ విద్యకు దూరమవుతున్నారు. సైన్స్ ల్యాబ్ పరికరాలు, సామగ్రిని విద్యాశాఖ అందివ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 8లో..



బైక్‌ను ఢీకొట్టిన లారీ

బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. 8లో..



బీజేపీ బలోపేతంలో శక్తి కేంద్రాలు కీలకం

బీజేపీ క్షేత్రస్థాయి బలోపేతంలో శక్తి కేంద్రాల పాత్ర కీలకమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడత మల్లేశం యాదవ్ తెలిపారు. 9లో..

చారిత్రక ఆనవాళ్లు.. వీరగల్లు

గ్రామాల్లో విరివిగా బయల్పడుతున్న రాతి శిల్పాలు

త్యాగం, వీరత్వానికి గుర్తుగా ఏర్పాటు

చాళుక్యులు, కాకతీయుల కాలంలో అధికం

ఇప్పటికే జిల్లాలో పదుల సంఖ్యలో గుర్తింపు



అలంకృత వీరశిల

చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని సోమరాజుల కుంటలో ఉన్న ఈ వీరగల్లు రాష్ట్రకూట కాలానికి చెందిన అలంకృత వీరశిల. ఒకటే అంతస్తున్న ఈ వీరశిలలో వీరుడు సర్వాభరణాలు ధరించాడు. కుడిచేతిలో బాణం, ఎడమచేతిలో విల్లు ధరించి డాకాలు చాచి యుద్ధ సన్నద్ధుడై ఉన్నాడు. నడినెత్తిన కొప్పు, మూపున వీరశృంఖల, నడుమున పట్టాకత్తి ధరించాడు. కాళ్లకు మహిళలకువలె పాంజీబులు, మువ్వల నూపురాలుండడం విశేషం. ఈ వీరగల్లును చూడడానికి స్త్రీమూర్తి లాగా కనిపిస్తుంది. ఈ వీరుడు అమరుడైనాడని తెలుపడానికి సూచనగా ఇద్దరు అప్సరాంగనలు వీరుని తలకు రెండువైపుల నిల్చొని వింజామరలు వీస్తున్నారు. ఇటువంటి వీరగల్లు చాలా అరుదుగా కనిపిస్తాయి.

చాళుక్య శైలిలోని సతిశిల



చేర్యాల మండలం దొమ్మాట గ్రామంలో చాళుక్య శైలిలో చెక్కబడిన వీరగల్లులో సతిశిల రాతి విగ్రహం ఉంది. తలమీద రిబ్బనుకట్టిన సిగముడి, పెద్దకుండలాలు, మెడలో హారం, బొడ్లో పట్టాకత్తి, దండకడియాలు, కాళ్లకడియాలు, రాణి భుజాలమీద చేయివేసి వైతస్తిక పాదభంగిమలో నిల్చున్నాడు రాచవీరుడు. పక్కన అలంకరించిన ధమ్మిల్లం, చెవులకు జుంకాలు, మెడలో హార, గ్రైవేయకాలు, నీవీబంధంతో వైతస్థిక పాదభంగిమలో నిల్చున్నరాణి వీరుణ్ణి కుడిచేయితో నడుముచుట్టి ఆలింగనం చేసుకుంటుంది.

సాక్షి, సిద్దిపేట: వీరగల్లులు.. ఏదో ఒకచోట వీటి గురించిన చర్చ మనం తరచు వింటునే ఉన్నాం. ఇప్పుడు జిల్లా వీరగల్లులకు అడ్డాగా మారింది. ఇప్పటికే పదుల సంఖ్యలో వీటిని తెలంగాణ చరిత్ర బృంద సభ్యులు గుర్తించారు. రాష్ట్రకూటులు (11వ శతాబ్దం) కాలం నుంచి 17వ శతాబ్దం వరకు గ్రామస్తులు, రాజులు రాతి విగ్రహాలను ఏర్పాటు చేశారు. గ్రామాన్ని, లేదా ఒక ప్రాంతాన్ని కాపాడడానికి వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేసిన వారు.. చెరువు కట్టలు తెగటం తదితర విపత్తులు సంభవించినప్పుడు ప్రాణాలకు తెగించి గ్రామ రక్షణ చేసిన వారు.. గ్రామాపపై దాడి చేసే మృగాలను వేటాడిన వారు, ఇలా వీరత్వం, త్యాగం చూపిన వారికి గుర్తుగా రాతి విగ్రహాలను ప్రతిష్ఠించి వారిని తలచుకోవడం, కొలుచుకోవడం చేసే వారు. ఈ విగ్రహాలనే వీరగల్లులు అంటారు.

ప్రతీ గ్రామంలోనూ..

రాష్ట్రకూటులు, చాళక్యులు, కాకతీయుల కాలంలో వీరుల ప్రతిరూపంగా అనేక వీరగల్లులు (రాతి విగ్రహాలు) ఏర్పాటు చేశారు. కానీ కాల క్రమంలో ఆయా వీరగల్లుల గురించి తెలిసిన వారు.. అలాగే వాటి వెనకున్న చాలా కథలు కాల గర్భంలో కలిసిపోయాయి. విగ్రహాల్లో చూపిన వివరాల మేరకు ఆ చరిత్ర కోణాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది. రాజులు చెక్కిన చరిత్రకు సమాంతరంగా ప్రజలు కాపాడుకున్న చారిత్రక ఆనవాళ్లు ఇవి.. జిల్లా ఓ దాదాపు ప్రతీ పాత గ్రామల్లోనూ ఇవి కనిపిస్తున్నాయి. అందులో కొన్నింటిని జిల్లాకు చెందిన కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి వాటి గురించి వివరించారు. మచ్చుకు కొన్నింటి గురించి తెలుసుకుందాం..

శూలారోహణ ఆత్మాహుతి వీరగల్లు



జగదేవపూర్ మండలం మునిగడపలో కాకతీయుల కాలం నాటి శూలారోహణ ఆత్మాహుతి వీరశైవ వీరగల్లు ఉంది. వీరశైవంలో శివసాయుజ్యం కోరి భక్తులు ఆత్మార్పణం చేయడం ఆచారం. దేహభాగాలను ఒక్కొక్కటి నరుక్కుని శివుడికి అర్పించడం. గండకత్తెరతో కత్తిరించుకుని తల పండు(శిరస్సునే ఫలంగా) ఇవ్వడం, వంచిన వెదురుగడకు జుట్టుకట్టుకుని కత్తితో మెడకోసుకోవడం, ఇతరుల సాయంతో తలకొట్టించుకోవడం, పొట్ట చీల్చుకోవడం, ఎత్తైన ప్రదేశాల నుంచి కింద పాతివున్న శూలాల మొనలమీదికి దూకడం, మంటల్లో దూకడం, నేలలోపాతిన శూలం, కత్తి మొనల మీద దిగబడి కూర్చొని దేహం చీలిపోయేలా చేయడం వంటివి కొన్ని వీరాచారాలు.

ఆహార్యంతో వీరుడు



కొండపాక మండలం మంగోళ్ గ్రామంలో కాకతీయుల కాలానికి చెందిన ఈ వీరగల్లులో వీరుడు కుడివైపు సిగతో, చెవులకు పెద్ద కుండలాలతో, చేతులు కాళ్లకు కడియాలతో, పెండేరాలతో, నడుమున మేఖలతో, వీరకాసతో, బొడ్లో చురికతో ఎడమవైపుకు నడుస్తున్నట్టు డాకాలు ముందుకువేసి నిల్చున్నట్టుగా ఉంది ఈ శిల్పం. రెండుచేతులతో పట్టుకున్న బల్లెంతో శత్రువును పొడిచి, మట్టి కరిపించాడు. తలపై ఛత్రం ఛాయలు కనిపిస్తున్నాయి. శరీరంపై జందెంతో రాచ ఆహార్యంతో కనిపిస్తున్న ఈ వీరుడు గొప్పవాడు.

మూడు అంతస్తులతో..



నారాయణరావుపేట మండలం రావరుకులలో కాకతీయుల కాలం నాటిది ఈ వీరగల్లు. పాగాచుట్టి, కుడివైపు కట్టిన పెద్దసిగతో మెడలో హారం, చెవులకు కుండలాలు, దండకడియాలు, ముంజేతి, కాళ్ల కడియాలు, వీరకాసె, నడికట్టుకట్టి, నడుంకు కత్తి ఒరతో, కుడిభుజం మీద నుంచి అమ్ముల పొదికి కట్టిన పట్టితో, కుడిచేత కత్తి, ఎడమచేత విల్లుతో కన్పిస్తున్న ఈ వీరుడు ఒక 'ఎక్కటి'. ఎక్కటి అంటే ఇప్పటి కమెండో వంటివాడు. ఒంటరిగా పోరాడేగలిగే యోధుడని అర్థం. ఈ విగ్రహశిల మూడు అంతస్తుల శిల్పాలతో ఉంది. కింది అంతస్తులో పోరాడుతున్న యోధుడు, 2వ అంతస్తులో దేవకన్యల భుజాలమీద చేతులు వేసి, దివికి పోతున్న వీరుడు, మూడో అంతస్తులో శివలింగం అంటే శివసాన్నిధ్యం పొందినట్లు కనిపిస్తున్నాడు.

నాలుగు అంతస్తుల్లో..



నంగునూరు మండలంలోని నర్మెట్టలో లభించిన చాళుక్య కాలం నాటి వీరగల్లు. ఈ వీరగల్లు గతంలో గుర్తించిన వీరగల్లులకంటె ప్రత్యేకం. ఈ వీరగల్లులోని మొదటి అంతస్తులో రాచహోదా వీరుడు గుర్రంపై స్వారీ చేస్తున్నాడు. రెండో అంతస్తులో కుడివైపు నుంచి ద్విభుజియైన దేవత ఆసనస్థితిలో ఉంది. మూడో కింద అంతస్తులో చెట్టెక్కిన వీరుడు, అతనికి ఎడమపక్కన విల్లమ్ములతో నిల్చున్న మరొక వీరుడు, అతనికి ఎదురుగా లేడి, దానికవతల వేటకుక్కలు అడివిపంది మీద దాడి చేస్తున్న దృశ్యం.. చివరిది 4వ కింది అంతస్తులో ఒక అడివిపందిని చుట్టుముట్టిన 4 వేట కుక్కల దృశ్యం చెక్కి ఉంది. ఈ వీరగల్లులోని ప్రతిదృశ్యం సినిమా ఫ్రేంలాగా చెక్కబడినది.

ముందు తరాలకి అందించాలి



గ్రామ చరిత్రకు ఆధారలైన వాటిని పరిరక్షించుకోవాలి. ముందు తరాలకి వాటిని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. రాజవంశాల చరిత్రలకు సమాంతరంగా రాయగలిగినంత చరిత్ర వీరగల్లులకు ఉంది. రాజుల చరిత్రలకు వాస్తవ ఆధారాలు చాలా దొరుకుతాయి. కానీ వీరగల్లులకు అన్ని ఆధారాలు దొరకవు. కొన్నిసార్లు వీరగల్లుల మీద చెక్కిన శాసనాలు వీరుల గురించి, వారు అమరులైన సంఘటనలని చూస్తే చెప్పగలుగుతాం.

–కొలిపాక శ్రీనివాస్, కొత్త తెలంగాణ చరిత్ర బృంద సభ్యుడు

న్యూస్‌రీల్

నేడు మల్లన్న నాలుగోవారం



కొమురవెల్లి (సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు నాలుగో ఆదివారం సందర్భంగా భారీగా భక్తులు తరలిరానున్నారు. స్వామి వారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించనున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అత్యవసర సేవల 108 వాహనాల్లో ఈఎంటీ, పైలెట్, (ఈఆర్ఓ)ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఆఫీసర్ పోస్టులకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీకి బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, బీఫార్మసీ, డీఫార్మసీ, డీఎంఎల్‌టీ అర్హతలతో పాటు 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. పైలెట్ ఉద్యోగానికి 10వ తరగతి ఉత్తీర్ణులై ఎల్ఎమ్‌వీ బ్యాడ్జి కలిగి ఉండి 23 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులని తెలిపారు. ఈఆర్ఓ ఉద్యోగానికి ఇంటర్మీడియట్ లేదా ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జత జిరాక్స్ కాపీలతో 13వ తేదీన ఉదయం 10 గంటలకు సిద్దిపేట బురుజు దగ్గర్లోని పాత ఎంసీహెచ్ భవనం స్వచ్ఛబడి మీటింగ్ హాల్ వద్ద హాజరుకావాలని తెలిపారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

వర్గల్(గజ్వేల్): వర్గల్ నవోదయలో తొమ్మిదో తరగతి ఖాళీ సీట్లలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 970 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 526 మంది పరీక్షకు హాజరైనట్లు నవోదయ ప్రిన్సిపాల్ రమేశ్‌రావు తెలిపారు. మూడు పరీక్ష కేంద్రాలకుగాను వర్గల్ నవోదయ కేంద్రంలో 322 మంది విద్యార్థులకు 183, గజ్వేల్ సెంట్ జోసెఫ్ స్కూల్ కేంద్రంలో 240 మందికి 134 మంది, ప్రజ్ఞాపూర్ సేయింట్ మేరీస్ స్కూల్‌లో 408 మందికి 209 మంది పరీక్ష రాశారన్నారు. మొత్తం మీద 444 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

నాచగిరి.. వ్రత సిరి

వర్గల్(గజ్వేల్): నాచారంగుట్ట శ్రీలక్ష్మీనృసింహక్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. హైదరాబాద్ జంటనగరాలు, ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. హరిద్ర నది వాగులో పుణ్యస్నానాలు చేశారు. స్వామివారి వ్రతమండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. మరోవైపు లక్ష్మీనృసింహుని సన్నిధిలో 8 నిజాభిషేకాలు, 12 కల్యాణాలు జరిగాయి. క్షేత్రంలో 35 సామూహిక వ్రతాలు జరిగాయి. మొక్కులు తీర్చుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తరించారు.



వ్రతాలు చేస్తున్న భక్తులు

లోక్ అదాలత్‌లో 1,482 కేసులు పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం



కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

సిద్దిపేటకమాన్: రాజీయే మార్గమే రాజ మార్గమని, ఏళ్ల తరబడి నడుస్తున్న కేసులను లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ టి.రఘురాం సూచించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రఘురాం, భవాని, స్వాతిరెడ్డి, సల్మాఫాతిమా పలు కేసులను రాజీ ద్వారా పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రఘురాం మాట్లాడుతూ.. సిద్దిపేటలో మొదటిసారిగా పెద్ద మొత్తంలో చాలా కేసులు పరిష్కారం అయినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కేసుల పరిష్కారంలో భాగంగా మూడు ప్రత్యేక బెంచ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు సైతం లిబరల్‌గా క్లెయిమ్‌లను మంజూరయ్యే విధంగా సహకరించాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో 1,482 క్రిమినల్ కేసులు, 98 బ్యాంకింగ్ కేసుల్లో రూ.10,36,444,24 ఓపీ కేసుల్లో రూ.1.83కోట్ల విలువైన క్లెయిమ్స్‌ను, పీఎల్‌సీ ద్వారా రూ.8లక్షలు, నాలుగు సివిల్ కేసులు పరిష్కరించబడినట్లు తెలిపారు. కోర్టు ప్రాంగణంలో హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ వారు కక్షిదారులకు భోజనం, నీటి వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి భవాని, లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి, న్యాయమూర్తి సల్మాఫాతిమా, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దేవునూరి రవీందర్, బార్ అసోసియేషన్ కార్యదర్శి మంతూరి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు రాజేశ్వర్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, ఏజీపీ మణి, ఆత్మరాములు, లక్ష్మీనారాయణ, పత్రి ప్రకాష్, రామకృష్ణ పాల్గొన్నారు.

కోమటిచెరువుపై వాకథాన్



సిద్దిపేటజోన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు 2023 సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం కోమటిచెరువు నెక్లెస్ రోడ్డుపై 2కే వాకథాన్ నిర్వహించారు. దీన్ని అసిస్టెంట్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్, ఏసీపీ దేవారెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్ ప్రారంభించారు. ఈనెల 13 నుంచి 17 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల ద్వారా ఆర్థిక, అక్షరాస్యత శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. బ్యాంక్ లావాదేవీలు, సైబర్ నేరాలు పట్ల అప్రమత్తత గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఆయా బ్యాంక్ అధికారులు, పోలీస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్తిరెడ్డి జన్మదిన వేడుకలు



మద్దూరులో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు, దూళ్మిట్ట మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మల్లిపెద్ది సుమలతమల్లేశం, మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, వంగ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు కంఠరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఊట్ల రవీందర్‌రెడ్డి, దుబ్బుడు దీపికావేణుగోపాల్‌రెడ్డి, దొమ్మ బాలమణిబాలకృష్ణ, ఎంపీటీసీలు గుజ్జుక సమ్మయ్య, గూళ్ల సత్యకళానందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, నాయకులు నాచగొని వెంకట్‌గౌడ్, బడుగు సాయిలు, గూడ రవీందర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): కరువు ప్రాంతమైన చేర్యాలను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేసిన జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆస్పత్రిలో రోగులకు పాలు పండ్లు పంపిణీ చేశారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో మంగోలు చంటి, కౌన్సిలర్లు పచ్చిమడ్ల సతీశ్‌గౌడ్, ఆడెపు నరేందర్, వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, బాలరాజు, నాయకులు బాల్‌నర్సయ్య పాల్గొన్నారు.



చేర్యాలలో కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ కరుణాకర్

దుబ్బాక కాంగ్రెస్‌లో వర్గపోరు!

రసవత్తరంగా నాలుగు స్తంభాల ఆట



- ఎవరికి వారే.. పోటా పోటీగా కార్యక్రమాలు
- తమకే టికెట్ అంటూ ముమ్మర ప్రచారం
- అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి, సిద్దిపేట/దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ వర్గపోరు తీవ్రమైంది. దీంతో కొన్ని రోజులుగా పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రవణ్ కుమార్‌రెడ్డి, సినీనటి కత్తి కార్తీక, మిరుదొడ్డి పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాల్‌రెడ్డి వేర్వేరుగా కుంపటి పెట్టుకుని సమావేశాలు, సభలు, యాత్రలు చేపడుతున్నారు. నేతల తీరుతో కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రతో నాయకులు సైతం జనంబాట పడుతున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం పోరాటాలు చేసేందుకు యత్నిస్తున్నారు. నలుగురు నేతలు తగ్గేదేలే అన్నట్లు ఎవరి కేడర్‌తో వాళ్లు ప్రజల్లోకి వెళ్తున్నారు. అలాగే తమకే టికెట్ వస్తుందంటూ ప్రచారం చేసుకోవడం గమనార్హం. నాలుగు ముక్కలుగా వర్గాలు విడిపోయి నువ్వా? నేనా అన్నట్లు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గతంలో భూంపల్లిలో శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ రెడ్డి వర్గాలు కొట్లాడుకుని పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై మరొకరు కేసులు సైతం పెట్టుకున్న విషయం తెలిసిందే.

మంతూరు నుంచి చెరుకు

తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం నుంచి ఫిబ్రవరి 1 నుంచి 8వ తేదీ వరకు హాథ్ సే హాథ్ జోడో పేరుతో గడగడపకు తిరిగారు. 9న మండలంలో నెలకొన్న సమస్యలపై ఒక్క రోజు దీక్షను మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ నెల 14 నుంచి రాయపోలు మండలం మంతూరు నుంచి ఇంటింటి పాదయాత్ర చేసేందుకు ప్రణాళికను రూపొందించుకున్నారు మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి. ఈయన ఉప ఎన్నికల్లో పోటీ చేసి 22,196 ఓట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు.

గడపగడపకు పన్యాల

2009 లో మెదక్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి పోటీ చేసి ఓటమి చెందాడు. ఈ నెల 5న దుబ్బాక పట్టణంలోని రేకులకుంట మల్లికార్జునస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్రను ప్రారంభించారు. గడగడకు తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తిరిగి యాత్రను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మిరుదొడ్డి నుంచి మద్దుల

మిరుదొడ్డి పీఏసీఎస్ మాజీ చైర్మన్ మద్దుల గాల్‌రెడ్డి సైతం సొంతంగా పాదయాత్ర చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పరామర్శలు, ఆర్థిక సహాయాలతో ప్రజలతో నిత్యం గాల్‌రెడ్డి సంబంధాలను కొనసాగిస్తున్నారు. ఎన్నికలు రాకముందే పరిస్థితి ఇలా ఉంటే ముున్ముందు ఎలా ఉంటుందోనని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. వీరందరిని ఒక్కతాటి మీదకు తీసుకరావాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుతున్నారు. అలాగే ఉప ఎన్నికల్లో కత్తి కార్తీక స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 636 ఓట్లు సాధించారు. తర్వాత కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ నెల 12వ తేదీన(నేడు) దుబ్బాక పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. అలాగే దుబ్బాక మండలంలో జోడో యాత్ర పేరుతో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కార్యకర్తలను సిద్ధం చేస్తూ ప్రణాళికను రూపొందించారు.

క్లుప్తంగా

విద్యాపీఠం సందర్శన


పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే దంపతులు

నారాయణఖేడ్: సంగారెడ్డి సమీపంలోని పసల్వాదిలోని శ్రీజ్యోతిర్మస్తు విద్యాపీఠాన్ని ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జయశ్రీరెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న సైకత లింగార్చనలో పాల్గొన్నారు. విద్యాపీఠం పీఠాధిపతి డాక్టర్ బ్రహ్మర్షి మహేశ్వర సిద్ధాంతిని కలుసుకున్నారు మహాశివరాత్రి ప్రత్యేక పూజలకు సిద్ధాంతి ఎమ్మెల్యే దంపతులను ఆహ్వానించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరుటౌన్: వాహనం ఢీకొనడంతో పాదచారి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ క్రాస్ రోడ్‌లోని బాలాజీ ఎలక్ట్రికల్ యూ టర్న్ వద్ద శనివారం రోడ్డు దాటుతున్న పాదచారిని సంగారెడ్డి వెళ్తున్న ఓ టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో అతడి రెండు కాళ్లు విరిగిపోయాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు చిరంజీవి(25)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి సంబంధీకులు పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలన్నారు.

శాస్త్రీయ విద్యపై చిన్న చూపు

- సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేసినా పరికరాలు కరువు
- కార్యాలయాలుగా ల్యాబ్‌ల వినియోగం
- పట్టించుకోని విద్యాశాఖ
- నష్టపోతున్న విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శాస్త్రీయ విద్యకు దూరమవుతున్నారు. ప్రభుత్వం పాఠశాలలకు సైన్స్ పరికరాలు, సామగ్రితో పాటు నిధులు సైతం మంజూరు చేయడం లేదు. ల్యాబ్ కోసం ప్రత్యేక భవన నిర్మాణానికి లక్షలు మంజూరు చేసింది. జిల్లాలో కొన్ని పాఠశాలలను మాత్రమే ఎంపిక చేసి భవనాలు నిర్మించారు. ఏడాదిగా ఆ భవనాలను కార్యాలయాలకు వాడుకుంటున్నారు. సైన్స్ ల్యాబ్ పరికరాలు, సామగ్రిని విద్యాశాఖ అందివ్వకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.

- జిల్లాలో 147 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో కేవలం 20 పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం 2019–20లో సైన్స్ ల్యాబ్ భవనాల నిర్మాణాలకు రూ.9 లక్షలు మంజూరు చేసింది.



ముస్లాపూర్‌లో నిర్మించిన సైన్స్‌ల్యాబ్

- హవేలిఘనపూర్ మండలంలో మూడు జెడ్పీ పాఠశాలలు, మెదక్‌లో 2, నిజాంపేట 1, రామాయంపేట 2, అల్లాదుర్గం 1, చిలిపిచెడ్ 1, టేక్మాల్ 2, చేగుంట 2, కొడిపల్లి 1, నర్సాపూర్ 1, శివ్వంపేట 2, వెల్దుర్తి 3 పాఠశాలలకు భవనాలు మంజూరు కాగా ఏడాది క్రితం భవనాలు నిర్మించారు.
- మరో 127 జెడ్పీ పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు లేవు. కొన్ని మండలాల్లో రెండు, మూడు సైన్స్ భవనాలు మంజూరైతే, మరి కొన్ని మండలాలకు మంజూరు కాలేదు.


తుప్పు పట్టిన పదేళ్లనాటి పరికరాలు

- ఏళ్ల తరబడి గ్రామీణ విద్యార్థులకు ప్రయోగశాలంటే తెలియని పరిస్థితి. ప్రతీ పాఠశాలలో ప్రయోగశాలలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- రూ.9 లక్షలతో సైన్స్ ల్యాబ్‌లకు భవనాలు నిర్మించినా, వాటిని కార్యాలయాలుగా వాడుకుంటున్నారు. గతంలో దశాబ్దాల క్రితం మంజూరైన సామగ్రిని పాఠశాల సైన్స్ టీచర్లు అందులో పెట్టడం లేదు. పాత సామగ్రి బీరువాలు, అల్మారాల్లో భద్రపరిచారు. అవి తుప్పు పట్టి పనికిరాకుండాపోయాయి.

బోధనతోనే సరి

ప్రభుత్వ పాఠశాలలో శాస్త్రీయ విద్యా బోధనపై నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోసైన్స్ సబ్జెక్టులకు సరైన ల్యాబ్ సౌకర్యాం లేక బోధనతోనే సరిపెడుతున్నారు. ఏడాది క్రితం సైన్స్ ల్యాబ్‌కు సంబంధించి భవనాలు నిర్మించినా సామగ్రి, పరికరాలు మాత్రం ప్రభుత్వం సరఫరా చేయలేదు. రూ.9 లక్షలతో భవనాలు నిర్మించినా కేవలం రూ.3 లక్షలు మంజూరు చేస్తే సామగ్రి, ఇతర పరికరాలు కొనుగోలు చేయవచ్చని సైన్స్ టీచర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సైన్స్ సామగ్రి, పరికరాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది.

పరికరాలు ఇవ్వలేదు



సైన్స్ ల్యాబ్ కోసం భవనం నిర్మించారు. ఇది నిర్మించి ఏడాది గడిచింది. ల్యాబ్ సామగ్రి, పరికరాలు మాత్రం ఇవ్వలేదు. ల్యాబ్‌లో ప్రయోగాలు చేసేందుకు పరికరాలు అవసరం. కొంత మేరకు మాత్రమే సరఫరా చేస్తే ల్యాబ్ ఏర్పాటుచేసినా వృథాయే.

– సమత, విద్యార్థిని, ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల

సైన్స్‌పై నిర్లక్ష్యం



ప్రభుత్వం సైన్స్‌పై నిర్లక్ష్యం వహిస్తుంది. మాకు ప్రయోగాలంటే తెలియదు. ప్రభుత్వం స్పందించి శాస్త్రీయ విద్యనందించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతీ పాఠశాలలో సైన్స్ ల్యాబ్ సౌకర్యం కల్పించి శాస్త్రీయ విద్యను మెరుగుపర్చాలి.

– భానుతేజ, విద్యార్థి, ముస్లాపూర్

ప్రత్యేక నిధులు ఇవ్వాలి



ప్రభుత్వం శాస్త్రీయ విద్యను అందించేందుకు కృషి చేయాలి. ప్రత్యేక భవనాలు నిర్మించడంతో పాటు, ఏటా ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి. ప్రయోగాలతో విద్యార్థులకు బోధించడం జరుగుతుంది. సరైన పరికరాలు లేక ప్రయోగాలు చేయించలేకపోతున్నాం.

– శ్రీకాంత్, సైన్స్‌టీచర్, ముస్లాపూర్

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్): కుక్కల దాడిలో 12 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దూల్మిట్ట మండలంలోని బెక్కల్ గ్రామానికి చెందిన చొదరి దశరథంకు గొర్రెలు పెంచుతున్నాడు. శుక్రవారం సాయంత్రం వరకు గొర్రెలను మేపి అనంతరం వాటిని పశువుల పాకలోకి తోలాడు. శనివారం ఉదయం వచ్చి చూసే సరికి 12 గొర్రెలు మృతి చెందగా, మరికొన్ని తీవ్రంగా గాయపడినట్లు గుర్తించాడు. గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

12 మందికి కోవిడ్ టెస్టులు



పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయిం శనివారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అదే విధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి నిర్వహించినట్లు చెప్పారు.

బైక్ ను ఢీ కొట్టిన లారీ

- భార్యాభర్తలకు తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం


గాయపడిన భార్యాభర్తలు

హత్నూర(సంగారెడ్డి): లారీ ఢీ కొన్న ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా కొడిపల్లి మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన ఊట్ల శ్రీకాంత్, అర్చన భార్యాభర్తలు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం స్వగ్రామమైన మెదక్ జిల్లా వెంకట్రావ్ పేట గ్రామానికి పల్సర్ బైక్ పై బయలుదేరారు. దౌల్తాబాద్ లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ ఉండటంతో శ్రీకాంత్ బైక్‌ను స్లో చేశాడు. ఈ క్రమంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఒక్కసారిగా బలంగా ఢీ కొట్టింది. దీంతో భార్యాభర్తలిద్దరూ కింద పడిపోయారు. వారిద్దరినీ లారీ కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. లారీ టైర్ల కింద ఇరుక్కుపోయిన వారిని స్థానికులు అతి కష్టం మీద బయటకు తీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ వారిని పోలీసు వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

మృతుడు అహ్మదీపూర్ వాసిగా గుర్తింపు


వెంకటేశం (ఫైల్)

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో శుక్రవారం లభించిన మృతదేహం గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్ వాసిగా గుర్తించినట్టు తొగుట ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో తుక్కాపూర్ శివారులోని గుట్టల వైపుకు ఓ మృతదేహం నీటిలో కొట్టుకొచ్చింది. దీంతో తుక్కాపూర్ గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహంపై ఉన్న దుస్తులు ఆధారంగా కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి ఫొటో సోషల్ మీడియాలో పోస్టుచేయడంతో అతడి కుటుంబీకులు గుర్తించారు. మృతుడు అహ్మదీపూర్‌కు చెందిన వడ్ల వెంకటేశం (40)గా గుర్తించారు. శనివారం అతడి అన్న వడ్ల రాములు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి, దుస్తుల ఆధారంగా మృతదేహం తన తమ్ముడిదేనని చెప్పాడు. మతి స్థిమితం లేకపోవడంతో గతంలో రెండు సార్లు ఇంటి నుండి చెప్పకుండా వెళ్లిపోయాడు. అదేవిధంగా 2023 సెప్టెంబర్ 13వ తేదీ నుంచి అతడి ఆచూకీ తెలియకుండా పోవడంతో గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు శనివారం జరిమానా విధించింది. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ వాహనాల తనిఖీ చేపట్టారు. మొత్తం పది మంది పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరు పర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేశ్‌బాబు రూ.21 వేల జరిమానా విధించారు.


నారాయణఖేడ్: గత కొద్దిరోజులుగా పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 73మంది పట్టుబడ్డారు. వారిని శనివారం నారాయణఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. వారికి న్యాయమూర్తి ప్రియాంక సిరిసిల్లా రూ.80 వేల జరిమానా విధించారని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండోమారు పట్టుబడితే జైలు శిక్ష విధిస్తామన్నారు. లోక్‌అదాలత్‌లో 431 కేసులను పరిష్కరించారు.

పారిశ్రామిక అభివృద్ధిపై మాట్లాడటం సిగ్గుచేటు

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరుటౌన్: అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ అమీన్‌పూర్ పరిధిలోని సుల్తాన్‌పూర్ పారిశ్రామిక అభివృద్ధిపై మాట్లాడటం సిగ్గు చేటు అని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఓఆర్‌ఆర్‌ను పటాన్‌చెరు నియోజకవర్గంలో సుమారు 30 కిలోమీటర్లు విస్తరించడంతో లక్షల్లో ఉన్న భూములు కోట్లలోకి చేరాయన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ పరిశ్రమలు నెలకొలిపి వేలాది మందికి ఉపాధి కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి భూములు వేలం వేయడం తప్పా, పరిశ్రామిక అభివృద్ధి చేయడం రాదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

జహీరాబాద్: తెలంగాణ అకాడమిక్ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జి సంస్థ(టాస్క్) ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్న జహీరాబాద్ విద్యార్థులు ప్రతిభ చాటారు. జహీరాబాద్ ఆచార్య డిగ్రీ కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు పలు సంస్థల్లో ఉద్యోగాలు పొందినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.హరికుమార్ తెలిపారు. ఈ మేరకు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టాస్క్ కోఆర్డినేటర్ ముత్యం కుమార్, కళాశాల కోఆర్డినేటర్ నర్సింహులు, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు రామచంద్రం, నందు, దత్తు, రమేశ్, నిఖిత, లావణ్య ఇశ్రత్ ఫాతిమా, స్వేత, ఉద్యోగాలు పొందిన విద్యార్థులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి


కనకవ్వ మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): పక్షవాతంతో బాధపడుతున్న భర్త, మానసిక వైకల్యంగల కూతురుకి సేవలు చేస్తూ జీవితంపై విరక్తితో మహిళ పురుగుల మందు తాగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేగులపల్లె గ్రామానికి చెందిన మాతంగి దుర్గయ్య, కనకవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. దుర్గయ్యకు పదేళ్ల క్రితం పక్షపాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాడు. చిన్న కూతురు సునీత మానసిక స్థితి సరిగా లేదు. కుమారుడు మాతంగి శశిధర్ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. భర్త, కూతురుకు సేవలు చేస్తూ మానోవేదనకుగురైంది. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం క్రిమిసంహారకమందు తాగింది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి, తరువాత నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యూనిస్ తెలిపారు.

బావిలోపడి యువకుడు..

ఝరాసంగం(జహీరాబాద్): ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన మహేశ్ (28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం బావిలో పడి మృతి చెందాడు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బావి నుండి తీసి జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

దశదిన కర్మకు వెళ్లి.. చెరువులో శవమై


నరేశ్ (ఫైల్)

దుబ్బాక రూరల్: దశదిన కర్మకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో శనివారం జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మిద్దె నరేశ్(36) తన బంధువు తోర్నాల సంజీవ ఇటీవల మృతి చెందాడు. అతడి దశదిన కర్మ కావడంతో బంధువులు, కుటుంబ సభ్యులు స్నానాలు చేయడానికి గ్రామ శివారు చెరువుకు వెళ్లారు. స్నానం చేసేందుకు చెరువులోకి దిగాడు. ప్రమాద వశాత్తు కాలుజారి నీటమునిగి నరేశ్ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హాఫ్ మారథాన్‌ను జయప్రదం చేయండి


మారథాన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ తదితరులు

అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

హుస్నాబాద్: పోలీస్ శాఖ, హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హాఫ్ మారథాన్ రన్నింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శనివారం అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎస్.మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాఫ్ మారథాన్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. హాఫ్ మారథాన్‌లో పాల్గొనే యువతీ యువకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే హాఫ్ మారథాన్ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీఐ ఎర్రల కిరణ్ తెలిపారు. 5కె రన్ ఏనే వద్ద ప్రారంభమై అంబేడ్కర్ చౌరస్తా, నాగారం రోడ్ చౌరస్తా, ప్రభుత్వ ఆస్పత్రి బైపాస్, గాంధీ చౌరస్తా, బస్ డిపో, అనబేరి విగ్రహం, మల్లెచెట్టు చౌరస్తా మీదుగా తిరిగి ఏనే వద్ద ముగుస్తుందన్నారు. అలాగే 10కె రన్ ఏనే వద్ద ప్రారంభమై చౌటపల్లి క్రాసింగ్ వరకు తిరిగి ఏనే వద్ద ముగుస్తుందని తెలిపారు. 21కె రన్ ఏనే వద్ద ప్రారంభమై అక్కన్నపేట వరకు వెళ్లి తిరిగి ఏనే వద్ద ముగుస్తుందన్నారు. హుస్నాబాద్ పట్టణం, అక్కన్నపేట రూట్లలో ఉదయం 6 గంటల నుంచి 8 వరకు ట్రాఫిక్ నిలిపివేయబడుతుందని, ఇందుకు ప్రయాణికులు, ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐ కిరణ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రఘుపతి రెడ్డి, ఎస్‌ఐలు మహేష్, వివేక్, హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు సంపత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుతో అధిక దిగుబడి


హుస్నాబాద్ శివారులో కోళ్ల ఎరువును పొలంలో చల్లేందుకు సిద్ధంగా ఉంచిన రైతు

- పొలాల్లో చల్లేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- బస్తా రూ. 700 ల వరకు కొనుగోలు
- కోళ్ల ఎరువు కోసం ముందస్తు చెల్లింపు

మునిపల్లి(అందోల్): రసాయన ఎరువుల ధరలు ఆకాశనంటడంతో సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. వివిధ రకాల పంటలు సాగే చేసేవారు అధిక దిగుబడి సాధించేందుకు పశువుల ఎరువులు, కోళ్ల ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో మేకల, గొర్రె, కోళ్ల ఎరువులకు డిమాండ్ పెరిగింది. కోళ్ల ఎరువులు కొద్దిపాటి చినుకులు పడినా భూమిలో కలిసి పోతుంది. కోళ్ల ఎరువులతో పంట అధిక దిగుబడి సాధించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ఎరువులు సకాలంలో దొరక్కపోవడంతో కొంత మంది రైతులు రసాయన ఎరువులపై ఆధారపడుతున్నారు. దీంతో గత ఆరేళ్లుగా రసాయన ఎరువుల వాడకం రెండింతలు పెరిగింది. పది ఇలోల కోళ్ల ఎరువు బస్తా రూ. 400 నుంచి 700లకు కొనుగోలు చేస్తున్నారు. ఇంత ధర ఉందంటే రైతులు ఎంత వినియోగిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కొందరు రైతులు కోళ్ల ఫారాల యజమానులకు ఎరువు కోసం అడ్వాన్స్ ఇస్తున్నట్లు చెబుతున్నారు.

భూమిలో కలిసిపోతుంది



కోళ్ల ఎరువు పొలంలో త్వరగా కలిసిపోతుంది. దీంతో పంట అధిక దిగుబడి వస్తుంది. అంతే కాకుండా కోళ్ల ఎరువు తక్కువ ధరకు దొరుకుతుంది. కోళ్ల ఫారాల యజమానులకు ఎరువుల కోసం ముందే అడ్వాన్సు ఇస్తాం.

– బోయిని విఠల్, రైతు

భూసారం పెంపు



సేంద్రియ ఎరువులతోనే పంట అధిక దిగుబడి సాధించి అధిక లాభాలు సాధించే అవకాశం ఉంటుంది. రసాయన ఎరువులతో భూమి, పంట దెబ్బతినడమే కాకుండా పంట దిగుబడి అంతంత మాత్రంగానే వస్తుంది.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి